134

# ఏమున్నది గర్వకారణం?

సుప్రసిద్ధమైన పురావస్తు శాలలు ప్రపంచ దేశాలన్నింటిలోనూ వున్నాయి. ఎన్నో అపురూపమైన వస్తువుల్ని మనమూ మ్యూజియములలో చూస్తూ వుంటాం. కనీసం చదవనన్నా చదువుతాం. కానీ ఒకే ఒక వ్యక్తి సమకూర్చిన బ్రహ్మాండమైన మ్యూజియాలు బహు తక్కువగా ఉన్నాయి. అవైనా సాలార్‌జంగ్ మ్యూజియంతో సరితూగుతాయని గట్టిగా చెప్పకోలేం.

ఖాదర్‌కూ, సలార్‌జంగ్‌కూ సరాసరి సంబంధాలేమీ లేవు, కానీ ఖాదర్ తండ్రి నవాబ్ వదూద్ సాబ్‌కూ, సాలార్‌జంగ్‌కూ అతి సన్నిహితమైన పరిచయాలున్నాయి. ఈ సన్నిహితత్వం చాలా దూరంగా పోయిందంటారు ఖాదర్. అలా ఇలా తిరగేస్తే, సాలార్‌జంగ్‌కూ తనకూ బంధుత్వం కూడా దొరుకుతుందంటాడు. సాలార్‌జంగ్ మేనత్త కూతురూ, తన మూడోమేనత్తా తోడి కోడళ్ళన్నాడు. అలా అంటున్నప్పుడు అతని కళ్ళు గర్వంతో మెరిసిపోయాయి.

"నాకయితే సరిగ్గా తెలియదు గానీ, నిజాం సాబ్‌కూ, సాలార్‌జంగ్ సాబ్‌కూ పడేది కాదని మా నాన్న అంటూ వుండేవాడు. కారణాలు నాకూ తెలియవండి. ఇవన్నీ మా నాన్న చెబుతుంటే వినేవాణ్ని. మా నాన్నకేమీ పనిలేదండీ. మహబూబ్‌నగర్ ఇలాఖాలో మా నాన్నకు మూడూళ్ళ జాగీరుండేది. పెద్ద యిల్లు. ఇంటి పక్కనే మసీదు గోడ నానుకొని పెద్ద ఖాళీ స్థలం. అందులో ఒక పక్కగా గొర్రెలమంద వుండేది. మరో పక్క ఇనప తీగెలతో, సందులేకుండా అల్లిన ఓ మాదిరి ఆవరణా వుండేది" అన్నాడు ఖాదర్.

ఆ ఆవరణ నిండా రకరకాల పక్షులు వుండేవట. ముఖ్యంగా పావురాళ్ళు, రంగు రంగుల చిలకలూ, రెండు నెమిళ్ళూ, నల్లపిచ్చికలు, గువ్వలూ ఇంకా యిలాంటివే బోలెడన్ని రకాలు. వీటిని మేపడం కోసం హమేషా యిద్దరు మనుషులుండేవారు. గుర్రాల పని చూడడానికి ముగ్గురు మనుషులు, వాటి మేతకోసం పదెకరాలబీడు, నాలుగు రాతితొట్లు ఈ తొట్ల నిండా ఎప్పుడూ దాణా వుంచేవారు. ఆ పక్కనే పనివాళ్ళ గదులు. వీళ్ళందరకూ వొండడానికి, వొడ్డించడానికి ఇద్దరు నీగ్రో ఆడవాళ్ళు ఉండేవారు.

"అదంతా శాశ్వతమనుకున్నామండీ. మీరు నమ్ముతారో లేదో గానీ మా అమ్మకు ముఖం కడిగించడానికీ, ఆమె పనులు చూడడానికీ జులేఖా అనే పనిమనిషి వుండేది. ఆమె కొడుకులు కూడా ఇప్పడీ వూళ్లోనే వున్నారండీ. ఆమె చచ్చిపోయి చాలా కాలమయింది. మా అమ్మ చెవుల నిండా మేలిమి పోగులుండేవి. మోచేతులదాకా బంగారపు గాజులు, అరికాళ్ళకు మట్టి కూడా అయ్యేది కాదు" ఖాదర్ ఆ రోజుల్ని తలచుకుంటూ.

వదూద్‌సాబ్ అందరూ జగీర్దారుల్లాంటివాడు కాదు. అతను వుండడం ఎక్కువకాలం హైదరాబాదులోనే వున్నా, నవాబులతో తిరిగినా డబ్బుకోసం తన రైతుల్ని పీడించేవాడు కాదు. దర్జా కోసం హోదా కోసం ఎంతయినా ఖర్చు చేసేవాడు. ఆదాయం అంతంత మాత్రంగా వుండి ఖర్చులు అధికం కావడంతో, ఉన్న ఆస్తిపాస్తులన్నీ అమ్ముకోవలసి వచ్చింది. వదూద్ చనిపోయే నాటికి, పెద్ద డాబా, జాగీర్దార్ అన్నపేరూ, ఆరుగురు పిల్లలూ తప్ప ఏమీ మిగల్లేదు.

"మా నాన్నకన్నా మా అమ్మ చాలా తెలివయిందండీ. నాన్నకు తెలియకుండా కొద్దిగా డబ్బూ బంగారమూ దాచి పెట్టింది. దాంతో కొంత కాలం గడిపాము. నాకు చదువురాదు. నేనే పెద్దవాణ్ణి. నా తరువాత యిద్దరు ఆడపిల్లలు పెళ్ళిళ్ళయి, పిల్లలు పుట్టాక యిద్దరూ చనిపోయారు. మిగిలిన మొగపిల్లలు కూడా పెద్దగా చదువుకోలేదు. యిప్పుడంటే కాగితాలూ, దస్తావేజులూ, రిజిష్టర్లు పారీకత్తులు ఉన్నాయనుకోండి. ఆ రోజుల్లో యివేవీ లేవండి. కృష్ణా జిల్లా నుంచి వచ్చిన తెలుగోళ్ళకు ఇల్లు అమ్మేశాం" అన్నాడు ఖాదర్.

అతను చాలా రకాల పనులు చేశాడు. కొంత కాలం ఓ రొట్టెల కార్ఖానాలో పనిచేశాడు. రెండు సంవత్సరాల పాటు యిరానీ హోటల్లో సప్లయర్‌గా వున్నాడు. మరో మూడున్నర సంవత్సరాల పాటు సినిమా హాల్లో గేటు కీపర్‌గా వున్నాడు. ఎక్కువ కాలం ఉన్నది రొట్టెల కార్ఖానాలోనే. ముందుగా రోజు కూలీకి కుదిరిరాడు; తరువాత ఇన్ని రొట్టెలకు ఇంత మజూరీ అన్న లెక్కన పనిచేశాడు.

"రాత్రింబవళ్ళూ పనిచేసినా రెండు మూడుకన్నా వచ్చేవి కావు. ఇరానీ హోటల్లో పనిచేస్తూ మానేయడానికి, మా పెద్దబ్బాయి కారణం. వాడో రోజున తప్పతాగి ఇంకో ఇద్దరు జులాయి వెధవలతో సహా రాత్రి పదకొండు గంటలకు నేను పనిచేస్తున్న హోటలుకే వచ్చాడండీ. వాడికి నేను 'చాయ్' తెచ్చివ్వాల్సి వచ్చింది. అంతకన్నా - వాడు చెడతాగి బండబూతులు మాట్లాడడం నేను భరించలేకపోయాను."

"సినిమా హాల్లో కాళ్ళు బిగుసుకుపోయేలాగా నిలబడడం, నిద్రమేలుకోవడం నా వల్ల కాకపోయింది బాబూ. ఊరికినే జీతమివ్వమంటే యిస్తారా? ఇచ్చినా నేను తీసుకొంటానా?? అందుకని ఆ పనీ మానేసి ఈ చాప దుకాణం తెరిచాను" అన్నాడు ఖాదర్ బాధగా.

సినిమాల్లో వున్నప్పుడు 'చేవాటు' వల్ల కూడా సంపాదించుకోలేని ఖాదరు, పెళ్ళాం గుబ్బానీలు అమ్మగా వచ్చిన మూడొందలతో ఈ వ్యాపారం చేస్తున్నాడు. తనక్కావలసిన పూసల దండలు, జడకుప్పెలతాళ్ళూ, గుండీలూ, బ్లేడ్లు, రేజర్లు చిన్న చిన్న అద్దాలు, పట్టు దారాలు, సవరాలు, జడపిన్నులు, అల్యూమినం గిన్నెలూ, ప్లేట్లు వగైరాలన్నీ ఉస్మాన్‌గంజి నుంచి తెచ్చుకుంటాడు. గుత్తగా కొంటాడు గనుక కాస్త చవకగా గిట్టుబాటు అవుతాయి. రూపాయికి పది పైసల నుంచి పావలా దాకా చూసుకొని అమ్ముకొంటాడు. రోజుకు పదిహేను యిరవై రూపాయల అమ్మకం దాకా వుంటుందని నాలుగయిదు రూపాయల దాకా మిగులుతాయని అన్నాడు ఖాదరు.

"రోజూ వొక్కచోటనే కూచోనండీ. అటు సనత్‌నగర్ నుండి సాలిబండదాకా తిరుగుతాను. ఎక్కువగా నాంపల్లి, కోటి, దోమల్‌గూడా, చిక్కడపల్లి, అఫజల్ గంజి... ఇక్కడ వుంటాను. వానాకాలం ఫాయిదా వుండదు... పిల్లలా?" అని ఐదువేళ్ళు చూపించాడు ఖాదర్.

"ఒకడు రౌడీల్లో కలిశాడు. వాడిప్పటికి మూడు నాలుగు సార్లు కొట్లో పడ్డాడు. రెండోవాడు అవిటిసన్నాసి. మూడోవాడు ఆయిల్ మిల్లుకాడ పనిచేస్తున్నాడు. ఆడపిల్లలిద్దరికీ పెళ్ళి చేశా నేనూ... ఆవిడా... అప్పుడప్పుడూ పెద్దోడూ..." అని ఆగిపోయాడు ఖాదర్ విషాదంగా నవ్వుతూ.

స్వరాజ్యం వచ్చే నాటికి ఖాదరు వయస్సు 32 సంవత్సరాలు. తన 63వ ఏట కూడా అతనింకా పూట బత్తెం కోసం దేవుళ్లాడుతూనే ఉండడం మనం సాధించిన అభ్యుదయానికొక ఉదాహరణ.